క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రుషి పంచమి పూజలు



సోమన్‌గుర్తిలో పూజలు నిర్వహిస్తున్న రఘురాంరెడ్డి

పూడూరు: ప్రతీఒక్కరు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సీనియర్ నాయకుడు రఘురాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సోమన్‌గుర్తిలో రుషి పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రుషుల, భైరవుల ప్రతిమలను ప్రత్యేకంగా తయారు చేయించి పూజలు నిర్వహించారు. ప్రతీ యేట వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జితేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రజనీకాంత్, రాజేందర్‌రెడ్డి, రవీందర్, జంగయ్య, రాజేదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

న్యాయవాది జిలాని



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది జిలాని

తాండూరు టౌన్: విద్యార్థులు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాదులు జిలాని, సుదర్శన్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 6 నుంచి 14 ఏళ్ల వయసున్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థి దశలో ఎలాంటి నేర పూరిత కార్యకలాపాలకు పాల్పడొదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఆనంద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు, డీన్ ప్రభాకర్, కోర్టు సిబ్బంది ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అర్హులందరికీ ఇవ్వాలి

బొంరాస్‌పేట: సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద పేదలకు అందించే ఆర్థికసాయం అర్హులందరికీ అందివ్వాలని బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నెహ్రూనాయక్ కోరారు. శుక్రవారం బొట్లోనితండాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెండేళ్లుగా అర్హులైన కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ సాయం మంజూరైనప్పటికీ బీఆర్‌ఎస్ కార్యకర్తలకు, నాయకులనే నెపంతో ఆర్థికసాయం ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వ సాయానికి ఆయా పార్టీల్లోని వ్యక్తులపై వివక్ష చూపొద్దని సూచించారు. ఈ విషయాన్ని అధికారులు గుర్తించి న్యాయం చేయాలన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి



ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న పర్సాపూర్ గ్రామస్తులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సామాన్య శాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు, పలువురు విద్యాభిమానులు ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లుగా సామాన్యశాస్త్ర ఉపాధ్యాయ పోస్టు ఖాళీగానే ఉందన్నారు. ఆరు, ఏడోతరగతి విద్యార్థులను ఒకే తరగతి గదిలో కూర్చోబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

జీవాలకు టీకాలు

షాబాద్: పీపీఆర్ వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అంతారం, వెంకమ్మగూడ గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకా వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాల్‌రాజ్, గోపి, కృష్ణమూర్తి, సుధాకర్, రైతులు తదితరులున్నారు.

కమీషన్ వచ్చేనా!



దోమలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింలుకు వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

డీలర్లకు అందని డబ్బులు

- ఐదు నెలలుగా పెండింగ్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు

దోమ: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతీ నెల లబ్ధిదారులకు రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. వారికి ప్రభుత్వం నెలవారీగా కమీషన్ వేసేది. ప్రతీ రేషన్ డీలర్‌కు రేషన్ బియ్యం పంపిణీ అనంతరం డబ్బులు జమచేసేది. కానీ ఐదు నెలలుగా నగదు వేయకుండా పెండింగ్ పెడుతూ కాలయాపన చేస్తుంది. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రేషన్ డీలర్లు కమీషన్ డబ్బులకోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ విషయం గురించి అధికారులను అడిగితే వస్తాయని బదులిస్తున్నారని చెబుతున్నారు.

మండలంలో రేషన్ కార్డుదారులు..

దోమ మండల వ్యాప్తంగా 34 రేషన్ దుకాణాలు ఉండగా అందులో 13,405 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో ఎఫ్‌ఎస్సీ 11,503, అంత్యోదయ 1,902 ఉన్నాయి. వారందరికీ ఇప్పటికే రేషన్ దుకాణాల ద్వారా ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్ట్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ ఐదు నెలలకు సంబంధించిన కమీషన్‌ను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.

అప్పులు చేస్తున్న డీలర్లు

రేషన్ బియ్యం నిర్ణీత కాలంలో పంపిణీ చేసేందుకు డీలర్లు అప్పులు చేయాల్సి వస్తుంది. బియ్యం పంపిణీ తర్వాతే సివిల్ సప్లై శాఖ ద్వారా కమీషన్ డబ్బులు చెల్లిస్తుంది. బియ్యం రవాణా, దిగుమతి కోసం హమాలీ, వర్కర్లు, దుకాణాల అద్దె, కరెంటు బిల్లుల కోసం అప్పులు చేయాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే కమీషన్‌తో ఖర్చులు పోనూ మిగితా సొమ్ముతో వారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఐదు నెలలుగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వివరిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలయాపన తగదు



ఐదు నెలలుగా పెండింగ్‌లోనే ఉంచుతున్నారు. వాటిని విడుదల చేయక పోవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నాం. కుటుంబ పోషణ భారమై లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయలేని పరిస్థితి నెలకొంది. అప్పులు చేసి పంపిణీ చేస్తున్నాం. కమీషన్ విడుదల చేయడంలో కాలయాపన చేయొద్దు. తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, రేషన్ డీలర్ల సంఘం మండల ప్రధానకార్యదర్శి, దోమ

పెండింగ్ డబ్బులు జమచేయాలి



ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్నాం. కానీ తమ కమీషన్ చెల్లించడంలో నిర్లక్ష్యం చూపుతుంది. కమీషన్ రాకపోవడంతో రూం అద్దె, కరెంటు బిల్లు, హమాలీల ఛార్జీలు చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం పెండింగ్ డబ్బులు వెంటనే జమచేయాలి.

– గండె నరేందర్, రేషన్ డీలర్, బొంపల్లి

నీరు నిల్వ ఉండకుండా చర్యలు



యాలాల: నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న పంచాయతీ సిబ్బంది



బొంరాస్‌పేట: శుభ్రం చేయిస్తున్న ఫకీరప్ప తదితరులు

ఎంపీఓ యాదయ్య

యాలాల: ఇంటి ఆవరణలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీఓ గాలి యాదయ్య సూచించారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి యాలాల గ్రామంలో పర్యటించారు. ఇళ్ల ఎదుట, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పారబోసుకోవాలన్నారు. ఇళ్ల సముదాయాల మధ్య అపరిశుభ్రంగా ఉన్న చోటా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అనంతరం పలువురి ఇళ్ల ఆవరణలో నిల్వ ఉంచిన బ్యారెళ్లు, పాత టైర్లను పరిశీలించారు. వీటిలో నిల్వ ఉన్న వర్షపునీటిని తీసివేయించారు. వర్షా కాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అపరిశుభ్రతే అనారోగ్యానికి మూలం

బొంరాస్‌పేట: పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని కొడంగల్ మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప అన్నారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశానుసారం చేపట్టిన డ్రై డే.. ఫ్రై డే కార్యక్రమంలో భగంగా ఇంటి పరిసరాలను పరిశీలించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సందర్శించారు. అక్కడ రోగాలకు కారణమయ్యే స్థలాలను గుర్తించి పరిశుభ్రం చేయించారు. నీటినిల్వ పాత్రలను ఖాళీ చేయించారు. దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, జేఈ తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశా కార్యకర్తలు పున్నమ్మ, రాధిక, నర్సమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్య నాయక్



మాట్లాడుతున్న లాల్య నాయక్

దోమ: ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్య నాయక్ తెలిపారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఎఫ్‌ఎల్‌ఎన్, బేస్‌లైన్, జీపీ, ఈపీ, ఎఫ్‌పీ పూర్తి చేయాలన్నారు. వర్క్‌బుక్, నోట్‌బుక్స్, యూనిఫాంలను ఆన్‌లైన్ చేసి ఎఫ్‌ఏ1 పరీక్షలను పూర్తి చేసి నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు ప్రతీ సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చేలా తీర్చిదిద్దాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతయ్య, సీఆర్‌పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయులు చైతన్య, రాజ్ కుమార్, రాధిక, బాలకృష్ణ, పాల్గొన్నారు.



పూజలో సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ యాదగిరి



తాండూరు టౌన్: శ్రీరామ్‌నగర్ కాలనీలో భజన

కొనసాగుతున్న పూజలు

దుద్యాల్: లగచర్ల గ్రామంలో నిర్వహించిన పూజలో కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, దుద్యాల్ ఎస్ఐ యాదగిరి, గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

హస్నాబాద్ గ్రామంలోని తెలుగువాడ వినాయకుడి మండపం వద్ద శుక్రవారం సాయంత్రం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బంట్వారం: బంట్వారం, కోట్‌పలి మండలాల్లో ప్రజలు గణనాథులను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొర్మామిడిలో మాజీ వైస్ ఎంపీపీ సావిత్రి వీరేశం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

ధారూరు: పులి చింతమడుగు తండాలో చిన్నారులు ప్రతిష్ఠించిన మట్టి గణనాథున్ని సాయంత్రం నిమజ్జనం చేశారు. అంతకు ముందు గ్రామస్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తాండూరుటౌన్ శ్రీరామ్‌నగర్‌లో నిర్వహించిన పూజలో పాల్గొని భక్తులు భజనలు చేశారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం

కుల్కచర్ల: ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య పేర్కొన్నారు. శుక్రవారం తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని కుల్కచర్లలోని ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్నాథ్, సంఘం మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవ అధ్యక్షుడు నర్సింలు, మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, శేరిలింగంపల్లి సంఘం అధ్యక్షుడు హన్మంతు, పీఆర్టీయూ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ సంఘం నాయకులు, ఎంఈఓ అబీబ్ అహ్మద్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ హరిక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గ్రహించి తమకు సహకరించాలని కోరారు.

పార్టీల అధ్యక్షులతో సమావేశం

యాలాల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా విషయమై శనివారం మండలంలోని వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీఓ యాదయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పులు, సవరణలు, అభ్యంతరాలపై ఆయా పార్టీల అధ్యక్షులతో అభిప్రాయ సేకరణ తీసుకోనున్నట్లు తెలిపారు.

కేజీబీవీ తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని కేజీబీవీ విద్యాలయాన్ని కడా ప్రత్యేకాధికారి, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, సౌర్యాలు, భోజనం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లూరి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో ఆత్మ గౌరవ సభ పోస్టర్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పరిగి: ప్రతి విద్యార్థి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం గురించి వివరించారు.

వామపక్షాల పోరాట ఫలితమే ఉచిత విద్యుత్

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుగ్గప్ప, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మల్కయ్య



విద్యుత్ పోరాటంలో అమరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

యాలాల: వామపక్షాల పోరాట ఫలితమే నేటి ఉచిత విద్యుత్ పథకమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య పేర్కొన్నారు. విద్యుత్ పోరాటం జరిగి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం రాత్రి యాలాల మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజల పెట్టుబడి, శ్రామికుల కష్టార్జితంతో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించారన్నారు. బ్యాంకు సంస్కరణలో భాగంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసేందుకు గత ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్నాయని, ఇందులో భాగంగా నాలుగేళ్ల పాటు ఏడాదికి 15శాతం విద్యుత్ ఛార్జీలు పెంచేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా విద్యుత్ పోరాటమని గుర్తు చేశారు. నాటి 9 కమ్యూనిస్టు పార్టీలు చలో అసెంబ్లీ పిలుపునివ్వగా, బషీర్‌బాగ్ వద్ద అప్పటి ప్రభుత్వం విచక్షణారహితంగా కాల్పులకు దిగిందన్నారు. ఈ చర్య వల్ల ఎందరో అమాయకులు సైతం ప్రాణాలు కోల్పోయినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, వేణుగోపాల్, లాలప్ప, హన్మంతు, రమేష్, శివకుమార్, మహేష్, నరేష్, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో అధికారులు

నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు



పూడూరులోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

పూడూరు: తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు సెలవులపై వెళ్లడంతో శుక్రవారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తహసీల్దార్ నాలుగు రోజులుగా సెలవుల్లో ఉండడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించిన లాగిన్‌ను డిప్యూటీ తహసీల్దార్‌కు ఇచ్చారు. దీంతో అతను కూడా సెలవు పెట్టడంతో ఆయా పనులు నిలిచిపోయాయి. మండల కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే వారు అధికారులు లేకపోవడంతో వెనుతిరుగుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మండల ప్రజలు చెబుతున్నారు. శుక్రవారం ఆర్ఐ, ఇద్దరు వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులకు హాజరయ్యారు. జిల్లా అధికారులు స్పందించి పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

సోలార్ లైట్ల ఏర్పాట్లు

ఎంపీడీఓ విశ్వప్రసాద్



మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: తాండూరు మండలంలోని 12 గ్రామాల్లో సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యునైటేడ్ వే బెంగుళూర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రాంపూర్‌తండా, వీరారెడ్డిపల్లి, ఉద్దాండపూర్, గుండ్ల మడుగు తండా, సంకిరెడ్డిపల్లి, అంతారం తండా, గుంత బాసుపల్లి, చిట్టిఘనాపూర్, ఖాంజాపూర్, పర్వాతపూర్, చింతమణిపట్నం, సంగెంకలాన్‌లో సోలార్‌లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల్లో అన్నీ మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జినుగుర్తి పీహెచ్‌సీకి విద్యుత్ స్కూటీ అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వీరప్ప, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ భార్గవి, సీనియర్ ఎగ్జిక్యూటీవ్ ప్రాజెక్టు అధికారిణి కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బహుళ నైపుణ్యాలను పెంచుకోవాలి



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్

ఘనంగా గిడుగు, ధ్యాన్‌చంద్ జయంతి

తాండూరు టౌన్: విద్యార్థులు చిన్ననాటి నుంచే బహుళ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కవి కోటం చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పాత తాండూరులోని ప్రభుత్వ నంబర్ టు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాంథిక భాషలోని తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి అనువదించి, సామాన్య ప్రజలు సైతం చదువుకునే విధంగా మార్పు తెచ్చిన ఘనత గిడుగు రామ్మూర్తికే దక్కిందన్నారు. విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించడంతో పాటు ఇతర భాషలను సైతం నేర్చుకోవాలన్నారు. అలాగే విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యత సాధించాలన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ కృషి, తెగింపు, క్రీడాలోకానికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు శ్రీనివాసాచారి, మొలక ప్రతినిధి, సామాజిక కార్యకర్త వెంకట్, ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: క్రీడాకారులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా, ఉపాధ్యాయ సిబ్బంది

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

కుల్కచర్ల: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిహెప్సిబా అన్నారు. శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగి పట్టణ కేంద్రంలో శుక్రవారం రైతులు యూరియా కోసం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారికి మద్దతుగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం ధర్నాలు చేస్తుంటే ప్రభుత్వం అరెస్టులు చేయించడం సరికాదన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వం నిలబడినట్టు చరిత్రలో లేదన్నారు. యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందు దొందేనని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులు ఒక్క రోజు ఇబ్బందులు పడ్డ దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ ఎంపీపీ అరవింద్ రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, వెంకటయ్య, సురేందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



యూరియా కోసం ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు